శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## జొన్నవాడ కామాక్షితాయి సన్నిధిలో మండల హోమం



**బుచ్చి జూన్ 24 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలో పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడ లోని శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయి సన్నిధిలో మండల హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు.మహాకుంభాభిషేకం జరిగి మండలం రోజులు పూర్తి అయిన సందర్భంగా మండల హోమం నిర్వహించారు. రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకరెడ్డి,హైదరాబాద్‌కి చెందిన కొలన్‌రాజారెడ్డి,పూజితమ్మ దంపతులు అమ్మవారిని దరి ్శంచుకున్నారు.అనంతరం గోపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం హోమం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతు ఇటీవల మహాకుంభాబిషేకం విజయేంద్రసరస్వతీ స్వామిజీ ఆశీస్సులతో నిర్వహించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలందరికి ఆయన ప్రత్యేకంగా దన్యవాదాలు తెలిపారు.స్వామిజీ సూచనల మేరకు మండల హోమం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు.ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,కొలన్‌రాజారెడ్డి,పూజితమ్మ దంపతులు వ్యవహారించారు.ఈ కార్యక్రమానికి పురస్కరించుకొని కొలన్‌రాజారెడ్డి దంపతులు ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు.

జులై 19 నుండి అత్యంత వైభవంగా జరిగే కోటికుంకుమార్చన కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రలు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో ఈకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యానాయుడు తెలిపారు.ఈకార్యక్రమంలో ఆలయ ఇఒ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు తిరువాయిపాటి నందకుమార్, గుంటూరు కామేశ్వరీ, అర్చకులు,ఆలయ సిబ్బంది పాల్గోన్నారు.

## మాదకద్రవ్యాలతో చెడుమార్గంలో యువత



**ముత్తుకూరు,జూన్24,ప్రభాతవార్త** సెబ్ ఎస్పీ హిమవతి ఆదేశాల మేరకు మాదకద్రవ్యాలు వినియోగం అనే అంశంపై విద్యార్ధులకు అవగాహన కలిగేలా తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని తెలియజేసారు. ప్రధానంగా యువత చెడుమార్గంలో తమ ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ బాలకృష్ణ పేర్కొన్నారు.శనివారం పిడతపోలురులో రత్నం ఫార్మస కళాశాలలో మాధకద్రవ్యాల ప్రమాదంపై గుడ్‌టచ్ లేక బ్యాడ్ టచ్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించి వారి చేత ఎటువంటి తప్పులు చేయమని చేసినవారిని క్షమించమని ప్రతిజ్ఞ చేయించారు.మాదకద్రవ్యాలు వినియోగం వలన కలిగే దుష్ఫలితాలు వివరించారు.మాదక ద్రవ్యాలు కలిగి ఉన్న రవాణా,అమ్మిన,కొనిన అటువంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.మాదకద్రవ్యాల సమాచారం గురించి గవర్నమెంట్ టోల్ ఫ్రీ నెంబర్ 14500 కు సమాచారం ఇవ్వగలరని తెలిపారు.ఈ విషయమై విద్యార్ధులు అవగాహన ద్వారా యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.విద్యార్ధులు ఉన్నతంగా చదివి సంస్కారవంతులుగా ఎదిగి ఉన్నత స్ధితికి వచ్చి తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాలలో లెక్చరస్‌తో పాటు విద్యార్ధులున్నారు.

## బుచ్చిలో జెసి కూర్మనాద్ సుడిగాలి పర్యటన

**బుచ్చి జూన్ 24 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో జెసి కూర్మనద్ సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన 5 వార్డులో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు.ఇప్పటి వరకు 4వందల ఇండ్లు పరిశీలన చేయడం జరిగిందని చెప్పారు.ప్రజలకు అవసరమైన సర్టిపికేట్లు అన్ని జులై 1 వ తేది అందచేయడం జరుగుతుందని చెప్పారు.పెద్దూరులో లేవుట్‌లో నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. గృహనిర్మాణాలు చాలా బాగా జరుగుతున్నాయని చెప్పారు.జగనన్న సురక్ష పధకం చాల మంచి పదకం అని ప్రజలందరు అవసరమైన సర్టిపికేట్లు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈకార్యక్రమంలో తహాసిల్దారు సుధీబాబు,కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి,పలువురు రెవిన్యూ,మున్సి ఫల్ అదికారులున్నారు.

## రానున్న ఎన్నికల్లో టిడిపికి చరమగీతమే

### అనంపై ధ్వజమెత్తిన అనిల్



**నెల్లూరు సిటీ,జూన్24,ప్రభాతవార్త** వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచి టిడిపికి పని చేశారని తరుచూ పార్టీలు మారుతూ విలువలేని రాజకీయాలు చేస్తున్నారని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిపై మాజీ మంత్రి,నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు.నెల్లూరు వైసీపీ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఇటీవల తాను పార్టీ వీడుతున్నట్లు వస్తున్న ప్రచారాలను ఖండిస్తూ తన రాజకీయ జీవితం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెన్నంటి సాగుతుందని తేల్చి చెప్పారు.వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని అసత్య ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి గతంలో మంత్రిగా ఏమి అభివృద్ధి చేశారు చెప్పాలన్నారు.సంఘం బ్యారేజీ నిర్మాణాన్ని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.ఆదురుపాడు రిజర్వాయర్ నిర్మాణాన్ని అడ్డుకున్నారని విమర్శించారు.పార్టీ పద్దతులు నచ్చకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి నిజాయితీని నిరూపించుకోవాలన్నారు.ఎమ్మెల్యే పదవి కావాలి కానీ పార్టీ వద్దనటం ఏ విధమైన వ్యక్తిత్వం అనిప్రశ్నించారు.ఆనం కుటుంబప్రతిష్టను కాపాడుతున్నది కేవలం విజయ్‌కుమార్‌రెడ్డి వ్యక్తిత్వమేనని కొనియాడారు.టిడిపిని తిట్టి వైసీపీలో చేరిన ఆనం తిరిగి పార్టీ మారుతారనడంలో సందేహం లేదన్నారు.సమస్యపైన అభివృద్ధి పైన ఏమాత్రం అవగాహన లేని లోకేష్ వైసీపీ ప్రభుత్వ తీరును విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.రానున్న ఎన్నికల్లో ఆనం రామనారాయణరెడ్డి ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేసినా ఓడిపోవడం ఖాయం అన్నారు.

## జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్డీఒ



**సంగం జూన్ 24 ప్రభాతవార్త** మండల కేంద్రమైన సంగంలోని సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆత్మకూరు ఆర్‌డిఒ కరుణకుమారి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం చాలా మంచి కార్యక్రమని చెప్పారు.ప్రజలందరు ఈకార్య క్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండల టీంతో ఆమె కొన్ని ఇండ్ల వద్ద ప్రజలకు అవగా హన కల్పించారు. 23 నుండి వచ్చే నెల 23 వరకు ఈకార్యక్రమం జరుగుతుందని చెప్పా రు.ఈకా ర్యక్ర మంలో ఎండిఒ గోపి.డిప్యూటి తహాసిల్దారు ప్రవీణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది,వాలింటర్లు పాల్గోన్నారు.

## జన్యుపరమార్పులతో మూడు గొర్రెపిల్లల జననం



**వింజమూరు,జూన్23ప్రభాతవార్త:** జన్యుపరమైన మార్పులు సంభవించి గొర్రెకు ఒకే ఈతలో మూడు పిల్లలు పుట్టిన సంఘటన మండలంలోని తమిదపాడులో చోటుచేసుకుంది.గొర్రె మూడు పిల్లలను ఈనిందన్న విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావ్ పరిశీలించి జన్యుపరమైన మార్పులతో మూడు గొర్రె పిల్లలు పుట్టాయని సాధారణంగా అయితే ఒక్క పిల్ల మాత్రమే పుడుతుందన్నారు. గ్రామానికి చెందిన పోటు రమేష్ చెందిన గొర్రె మూడు పిల్లలను ఈనిందని చర్చించుకుంటున్నారు.

## ప్రభుత్వపాఠశాలకు ప్రైవేటుబస్సు ఏర్పాటు అభినందనీయం




**మనుబోలు,జూన్24,ప్రభాతవార్త:** జిల్లాలో ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు ప్రవేటుబస్సు ఏర్పాటు చేసిన ఘనత మాజీ సర్పంచ్ ఎన్.ఎస్.ఆర్ పౌండర్ కిరణ్‌కుమార్ రెడ్డికే దక్కిందని మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి కితాబిచ్చారు. మనుబోలు కోదండరామపురం బి.ఎస్ ఆర్ కళ్యాణమండపం వద్ద అక్కంపేట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు 25లక్షల రూపాయల సొంత నిధులతో బస్సు కొని మంత్రి చేతులమీదుగా నప్రారంభించారు. బస్సును ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతు అక్కంపేట యు.పి పాఠశాలను మూసివేసే దశనుంచి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో హైకోర్టుకు వెళ్ళి పాఠశాలను కిరణ్‌కుమార్‌రెడ్డి నిలబెట్టారని మంత్రి అభినందించారు.వై.సి.పి అదికారంలోకి వచ్చిన అనంతరం వై.సి.పి ప్రభుత్వంలో నాడు,నేడు పథకంలో అక్కంపేటలో మంచి స్థలంలో హైస్కూలు భవనం నిర్మిస్తున్నారని, ఈహైస్కూలుకు పిల్లల్ని పెంచే క్రమంలో విద్యార్ధుల రవాణాకు 25లక్షల నిధులతో బస్సు కొనడం జరిగిందని చెప్పారు.మంచి మనసున్న కిరణ్‌కుమార్‌రెడ్డికి ఆభగవంతుడు ఆర్థిక పరిపుష్టి ఇవ్వాలని ఆకాంక్షించారు.ముందుగా మంత్రి బస్సును రిబ్బన్‌కట్‌చేసి ప్రారంబించి ముందుకు నడిపారు.అనంతరం పార్టీ నాయకులతో కలసి పచ్చజెండావూపి గ్రీన్ సిగ్నల్‌ఇచ్చారు. ఎన్.ఎస్.ఆర్ పౌండర్ కిరణ్‌కుమార్‌రెడ్డి,వై.సి.పి మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి,ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు చిట్టమూరు అజయ్‌కుమార్‌రెడ్డి,ఉంగర రవీంద్రరెడ్డి,అక్కంపేట స్కూల్ కమిటిచైర్మన్ అంబటి శ్రీనివాసులరెడ్డి, అక్కంపేట ఉపసర్పంచ్ పూండ్ల శ్రేహరిరెడ్డి, నాయకులు చిట్టమూరు నరసారెడ్డి,చిల్లకూరు వెంకురెడ్డి,పోతుగుంట షబ్బీర్,పెనమల్లి రామకృష్ణారెడ్డి,ఎం.ఇ.ఒ శేషాద్రివాసు,తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌లను సత్వరం పరిష్కరించాలి



**నెల్లూరు కార్పొరేషన్,జూన్24,ప్రభాతవార్త** జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే గ్రీవెన్స్‌లను సత్వరం పరిశీలించి,నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి శనివారం ఉదయం వెలగపూడి సచివాలయం నుండి జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూహక్కు,రీసర్వే, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పురోగతి,జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్ పాల్గొని జిల్లాలో అమలు వివరాలను ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ పురోగతి,జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలు వివరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. జిల్లాలో జగనన్నకు చెబుదాంకు సంబంధించి ఎక్కువ సంఖ్యలో రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్,పురపాలకశాఖ,హోం శాఖలకు సంబంధించిన గ్రీవెన్స్ వస్తున్నాయని,వీటి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులను నోడల్ అధికారులుగా నియమించి,వచ్చిన గ్రీవెన్స్‌కు సంబంధించి ప్రతిరోజూ ఆయా శాఖల అధికారులతో సమీక్షిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాధ్,కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక,అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి,జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, నెల్లూరు, కావలి,ఆత్మకూరు ఆర్‌డిఓలు మలోల, శీనానాయక్,కరుణకుమారి,పంచాయతీరాజ్,ఆర్‌డబ ్ల్యూఎస్‌ఆర్ అండ్ బిఎసీ లు అశోక్‌కుమార్, రంగవరప్రసాద్,గంగాధర్,జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డా.పెంచలయ్య,జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు,డ్వామా పిడి వెంకటరావు,సిపిఓ ఎస్.రాజు,సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి హనుమాన్ ప్రసాద్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నైపుణ్యంతో ఉన్నత ఉద్యోగాలు: ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి





**ఆత్మకూరు,జూన్23ప్రభాతవార్త:** ఏరంగంలోనైనా ఉన్నతస్థాయికి చేరాలంటే నైపుణ్యం అవసరమని అప్పుడే పనిచేసే చోట ఉన్నతస్థాయికి చేరేందుకు అవకాశముంటుందని , ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యంపై శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించాలని ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలో తొలుత స్కిల్ హబ్‌ను ప్రారంభించారు. హబ్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్ధులకు ఉన్నతమైన ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. స్కిల్‌హబ్ ద్వారా శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కోసం పలు కంపెనీలతో ఒప్పందం చేసుకునే విధంగా సూచించామని దీని ద్వారా క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించి ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉంటుందన ఆనరు. అనంతరం జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో ఆరువేల ఉద్యోగాలు కల్పనే ధ్యేయంగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈప్రాంత యువత రానున్న పరిశ్రమలకు అనుగుణంగాతమ వృతి నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఎక్కడికో వెళ్ళి ఉద్యోగాలు చేయాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఉద్యోగాలు పొందవచ్చన్నారు. శనివారం జరిగిన జాబ్‌మేళాకు 10కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా 778మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వారిలో 315మంది వివిధ కంపెనీలకు ఎంపిక కాగా 121షార్ట్ లిస్ట్ చేసినట్లు వివరించారు. డిఎస్ డిఒ విజయవినీల్‌కుమార్, సీడెప్ జీడియం హైమావతి, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, ఎపిఎస్‌ఎస్‌డిసి , సీడెప్ ఉద్యోగులు పాల్గొన్నారు. వైసిపి నాయకులు అల్లారెడి ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంగం సచివాలయాన్ని పరిశీలించిన డిపిఒ



**సంగం జూన్ 24 ప్రభాతవార్త**సంగం సచివాలయాన్ని జిల్లా పంచాయితీ అధికారి సుష్మితారెడ్డి పరిశీలించారు.సచివాలయం సిబ్బందిని ప్రభుత్వ పధకాలు అమలు తీరు గురించి ప్రశ్నించారు. జగనన్న సురక్ష కార్యక్రమం పై సిబ్బందికి పలుసూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతికుటుంబంలో సంక్షేమపథకాలు అందలాన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఒకటో తేది నుండి జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేసి నేరుగా 13 రకాల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.ఈకార యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గోన్నారు.

## ఉదయగిరిలో వైఎస్‌ఆర్‌సీపీ జెండాను ఎగురవేయాలి



**మర్రిపాడు,జూన్23ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గంలో 2024 శాసనసభ ఎన్నికల్లో వైఎస్ ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నెల్లూరు పార్లమెంట్ మాజీ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మర్రిపాడు మండలం బ్రాహ మణపల్లిలో శనివారం ఉదయగిరి నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు .ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్‌ఆర్‌సిపి కొన్ని పరిణామాల వలన భ్రష్టుపట్టి పోయిందన్నారు. ఈపరిస్థితులను చక్కదిద్దేందుకు కుటుంబం నుంచి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని రంగంలోకి తెస్తున్నామన్నారు. రాజగోపాల్‌రెడ్డికి ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించాలని తమకుటుంబం తరపున వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశామన్నారు. ఇందుకు సంబంధించి రెండుమూడురోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి వైసిపి శ్రేణులు అండగా నిలవాలని కోరారు. గ్రామాల్లో తమకున్న వ్యక్తిగత అభిప్రాయ బేధాలను పక్కనపెట్టి గ్రామాల్లోని వైసిపి నాయకులు సమన్వయం చేసుకొని రాజగోపాల్‌రెడ్డికి తోడ్పాటును అందించాలని రాజమోహన్‌రెడ్డి కోరారు. ఉదయగిరి నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి తమకుటుంబం ఎంతో కృషి చేశామన్నారు. ఉదయగిరిలోని ఇంజనీరింగ్ కాలేజీకి సంబంధించి 250కోట్ల రూపాయల విలువైన ఆస్తులను ప్రభుత్వానికి అప్పగించి అగ్రికల్చర్ యూనివర్శిటీని ఏర్పాటు చేసి త్వరలోనే దివంగత నేత మేకపాటి గౌతంరెడ్డి అగ్రికల్చర్ యూనివర్శిటిని చేసే ప్రతిపాదన కూడా ముఖ్యమంత్రి దృష్టిలో ఉందన్నారు.

**జలదంకి నుండి గడపగడపకు శ్రీకారం:** ఉదయగిరి వైసిపి నాయకులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి దగ్గర నుండి ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తమకు అధికారిక ఉత్తర్వులు అందిన వెంటనే గడపగడపకు కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. ఈనెల 28,29తేదీల్లో ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని జలదంకి మండలం నుండి తాను గడపగడప కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. నియోజకవర్గ వైఎస్‌ఆర్‌సిపి నాయకులు , కార్యకర్తలు తమకు సహాయ సహకారాలు అందించి ముందుకు నడిపించాలని ఆయన కోరారు. ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని జడ్పీటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు , సర్పంచ్‌లు , నాయకులు , గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేకపాటి పరిచయ వేదికలో సీతారామపురం నేతలు



**సీతారామపురం జూన్ 24 ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో మేకపాటి స్వగృహంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులతో మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ,సోదరుడు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీతారామపురం వైసిపి నాయకులు మేకాపాటి సోదరులను కలిసి శాలువాలతో సత్కరించారు .ఈకార్యక్రమంలో మండల నాయకులు జడ్‌పిటిసి చెరుకుపల్లి రమణారెడ్డి, మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపిటిసి తిరపతయ్య, మాజీ ఎంపిపి అబ్రహా ం,పాణం రమణయ్య,గుళ్లపల్లి తిరిపాల్,గోరంట్ల తిరిపాల్,సుబ్బారెడ్డి, బక్కా కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తహాశీల్దార్ కార్యాలయ సిబ్బంది విధుల్ని అడ్డగించినందుకు 41 మంది టిడిపి నేతలు అరెస్ట్



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త:** కావలి తహాశీల్దార్ మాధవరెడ్డి ఫిర్యాదును పురస్కరించుకొని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడుతో సహా 41 మంది టిడిపి నేతలను అరెస్ట్ చేసినట్లు కావలి డిఎస్పీ వెంకట రమణ శనివారం రాత్రి టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో చెప్పారు. శుక్రవారం టిడిపి నేత మాలేపాటి టిడిపి నేతలతో తహాశీల్దార్ కార్యాలయంలో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం రెవెన్యూ సిబ్బంది విధులకు ఆటంకపరిచి అడ్డుకోవడం నేరమని తహాశీల్దార్ మాధవరెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా కార్యాలయం వద్ద వంటావార్పు, భోజనాలు తినడం చట్టవిరుద్ధమని తెలిపారు. శనివారం కావలి తహాశీల్దార్ మాధవరెడ్డి ఫిర్యాదును పురస్కరించుకొని మాలేపాటితో సహా 41 మందిని అరెస్ట్ చేసినట్లు డిఎస్పీ తెలిపారు.

## ఆటో డ్రైవర్ కుమార్తె పొట్టెమ్మకు స్టేట్ జగనన్న బ్రిలియన్స్ అవార్డు



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త:** కావలి మున్సిపాల్టీ పరిధిలోని ముసునూరు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌నగర్‌లో నివసిస్తున్న ఆటో డ్రైవర్ కమతం శ్రీనివాసులు, ఆయన సతీమణి రమా దంపతుల కుమార్తె పొట్టెమ్మకు స్టేట్ జగనన్న బ్రిలియన్స్ అవార్డు దక్కింది. కావలి ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఆర్డీవో శీనానాయక్ పొట్టెమ్మను సత్కరించి అభినందించారు. కావలి రూరల్ మండలం ఒట్టూరులో ఆంధ్రప్రదేశ్ మోడల్ కళాశాలలో పొట్టెమ్మ ఇంటర్మీడియట్ సిఇసి గ్రూపులో జిల్లా ప్రథమ ర్యాంక్ సాధించడం ఎంతైనా అభినందనీయమని ఆర్డీవో తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా చదువుకొని ఉన్నత విద్యనభ్యసించి బావితరాలకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. మరెంతో మంది విద్యార్థులకు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గంధం ప్రసన్నాంజనేయులు, సీనియర్ దళిత నేత దాసరి బాలకృష్ణ, ఆర్‌విడిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల వెంకటేశ్వర్లు, బాలు క్రియేషన్స్ బాలు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎలసిరి హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## దారివివాదమై గాలిపాళెంలో ఘర్షణ



**చేజర్ల, జూన్23ప్రభాతవార్త:** చేజర్ల మండలం గాలిపాళెంలో ఇంటి దారి విషయమై జరిగిన వివాదంలో నలుగురు గాయపడిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గాలిపాళెంకు చెందిన కావటి అంజయ్య, సిరిగిరి శేషయ్యల ఇంటికి వెళ్ళే దారి విషయమై కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఈనేపథ్యంలో కావటి అంజయ్య కోర్టుకు వెళ్ళి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నట్లు సమాచారం. అయితే సిరిగిరి శేషయ్య దారి విషయమై సచివాలయంలో అర్జీ ఇచ్చి ఉన్నాడు. ఈమేరకు శనివారం డిఎల్‌పిఒ పంచాయతీ సిబ్బందితో కలసి స్థల విషయం వివాదాన్ని పరిశీలించేందుకు వెళ్ళాడు. వీరితోపాటు ఆపంచాయతీ సర్పంచ్ భర్త , ఆగ్రామ వైసిపి నాయకులు వివాద స్థలం దగ్గరకు వెళ్ళారు. మాటామాటా పెరిగి ఇరువురి మధ్య వివాదం పెద్దదైంది. అంజయ్య కుటుంబీకులు ఓ నాయకుడిపై చెయ్యిచేసుకోవడంతో అతను మహిళను జుట్టుపట్టుకొని లాగడంతో కిందపడిపోయింది. ఈలోగా ఎవరో రాళ్ళు విసిరివేయడంతో అధికారులు వెనుతిరిగి వెళ్ళినట్లు సమాచారం. సాయంత్రం ఆ గ్రామానికి చెందిన వైసిపి నాయకుల బంధువులు అంజయ్య ఇంటిమీదకు వెళ్ళి దాడి చేయడంతో అంజయ్య భార్య ఆనందమ్మ, కుమారుడు సుబ్బరాయుడు, కోడలు సునీతలకు రక్తగాయాలైనాయి, అంజయ్యకు గాయాలైనాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ మరిడి నాయుడు సమాచారం అందుకున్న చేజర్ల ఎస్ఐ మరిడినాయుడు సిబ్బందితో గ్రామంలోకి వెళ్ళి విచారణ చేపట్టి దర్యాప్తు చేపడుతున్నారు. గతంలోను ఈ గ్రామంలో కులపరమైన , పార్టీపరమైన ఘర్షణలు జరిగి రాళ్ళదాడులు జరిగి ఉన్నాయి. ఈమేరకు గ్రామంలో పోలీసు బందోబస్తును ఏర ఆపటు చేసి ఎలాంటి వివాదాలకు తావులేకుండా చూస్తున్నామని ఎస్ఐ మరిడి నాయుడు పేర్కొన్నారు.

## మాతమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాలేపాటి



కావలి, జూన్ 24 ప్రభాతవార్త కావలి మున్సిపాల్టీ పరిధిలోని ముసునూరులోని మాతమ్మ దేవాయంలో జరుగుతున్న తిరునాళ్ళ సందర్భంగా ఊరేగింపులో టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు టిడిపి నేతలతో పాల్గొన్నారు. మాతమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు మాలేపాటి నిర్వహించారు. ఆయనను పూజారులు సత్కరించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరినాయుడు, పట్టణ రైతు విభాగం అధ్యక్షులు చిట్టాబత్తిన మాల్యాద్రి, టిడిపి నేతలు రావినూతల వెంకటేశ్వర్లు, మందా శేషయ్య, కమతం శ్రీను, చలంచర్ల వెంకట రమణ, వల్లపు నారాయణ, వల్లపు శ్రీహరి, హరీష్,మౌలాలి, సురేంద్ర, సునీల్, స్వర్ణ మహేష్, టి.వెంకటేశ్వర్లు, మల్లికార్జున, తాళ్ల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరులో ప్రైవేటు బ్యాంకుల భాగస్వామ్యం కావాలి



**నెల్లూరు కార్పొరేషన్, జూన్24, ప్రభాతవార్త** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరులో ప్రైవేటు బ్యాంకులు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని కలెక్టర్ హరి నారాయణన్ జిల్లా కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశం నిర్వహించారు. తొలుత గత సంవత్సరం జిల్లాలో సాధించిన బ్యాంకింగ్ ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్ వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. కౌలు రైతులకుఎస్టీ, ఎస్సీ మహిళలకు విరివిగా రుణాలు మంజూరు చేసి వారి ఆర్థిక స్వావలంభనకు తోడ్పడాలన్నారు. అదేవిధంగా జగనన్న తోడు, చేయూత,సున్నావడ్డీ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు తోడ్పాటును అందించాలన్నారు. నెల్లూరు నగరపరిధిలోని టిడ్కో ఇళ్ల ఆవాస పరిధిలో బ్యాంకుఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగాకేంద్ర ప్రభుత్వ స్టాండప్ ఇండియా పథకం ద్వారా పేద ప్రజలకు సహాయం అందించుటకు బ్యాంకులు ముందుకు రావాలన్నారు. తదుపరి 2023-2024 జిల్లా వార్షిక ఋణప్రణాళికను జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆవిష్కరిం చారు. ఈ సమావేశంలో కెనరాబ్యాంక్ ఆర్ఎం నాగరాజు,నాబార్డు డిడిఎం రవిసింగ్,డిఆర్‌డిఏ,మెప్మా ఎపియంఐపి పీడీలు సాంబశివారెడ్డి, రవీంద్ర, శ్రీనివాసులు,మత్స్యశాఖ,పశుసంవర్ధకశాఖ జెడిలు నాగేశ్వరరావు,మహేశ్వరుడు,జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రాజు,బ్యాంకర్లుపాల్గొన్నారు.

# నీతో మాట్లాడేందుకు నీటి సంఘ అధ్యక్షుడు చాలు

### బెట్టింగ్‌లు కాసే నువ్వా లోకేష్‌ని విమర్శించేది
### ఎమ్మెల్యే అనిల్‌పై బీద ధ్వజం

**నెల్లూరు జూన్ 24, ప్రభాతవార్త-వైద్యం** జిల్లాలో టీడీపీ ఏమి చేసిందో, వైసీపీ ఏమి చేసిందో మాట్లాడడానికి లోకేష్‌బాబు రావాలని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అనడం హాస్యాస్పదంగా ఉందని, లోకేష్‌బాబు చర్చకి రావాల్సిన అవసరం లేదని, అనిల్‌కుమార్ యాదవ్ నీతో చర్చకి నీటి సంఘ అధ్యక్షుడు చాలని నీ స్థాయి అదని గుర్తుంచుకోవాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద.రవిచంద్ర ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని మాగుంటలేఅవుట్‌లో బీద.రవిచంద్ర నివాసంలో విలేఖరులతో మాట్లాడారు. నీటిపారుదల శాఖామంత్రిగా నీఅంత అసమర్థ, చేతకాని మంత్రిని ఇప్పటి వరకు చూడలేదని బీద ఆగ్రహం వ్యక్తం చేశాడు. సంగం, పెన్నా బ్యారేజీలను నువ్వు, నీ సీఎం పూర్తి చేయలేదని, 85శాతం టీడీపీ పూర్తి చేసిందని, మిగతా 15శాతం పూర్తి చేసేందుకు మూడున్నరేళ్ళ కాలం పట్టిందని, అనిల్ ఏదో చిక్కులు ముడులు విప్పానని మాయల పకీరు మాటలు చెపుతున్నాడని హేళన చేశారు. అక్కడ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం, ఇక్కడ గౌతమ్‌రెడ్డి విగ్రహాలు పెట్టడం తప్పితే సంగం బ్యారేజీని పూర్తి చేశావా అని ప్రశ్నించారు. నువ్వు మగాడివైతే రా సంగం బ్యారేజీ మీదకి రా, సిగ్గు లేకుండా నీ జగన్ పూర్తికాని బ్యారేజీని ప్రారంభించిన సీఎం ఏవరైనా ఉన్నారంటే అది నువ్వు జగనేనని ఏద్దేవా చేశాడు. సంగం బ్యారేజీలో ఉన్న లోపాలన్నింటినీ టీడీపీ పూర్తి చేసిందన్నారు. 15 శాతం పనులను పూర్తి చేయలేక ప్రారంభించుకున్న మీరు లోకేష్‌ని విమర్శిస్తావాని మండిపడ్డారు. మీరు పాదయాత్ర చేశారా జైలు పక్షులు మీరు, రోడ్డు మీద రోజుకి 10కిలోమీటర్లు జగన్ తిరిగితే లోకేష్ రాయలసీమ నాలుగు జిల్లాలు తిరిగాడు, సీఎం కడప జిల్లాలో పాదయాత్రకి అడుగడునా లోకేష్‌కి నీరాజనాలు పట్టారు. మీతో వందమంది రాక జనాలని పిలుచుకుని మీరు ఇప్పుడు ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. ఒరేయ్ అనిల్ అని మేము నీభాషలో కూడా మాట్లాడగలమని బీద హెచ్చరించారు. నీకు ఎన్ని లేవు జిప్పుబాబా, బెట్టింగ్ బాబా లాంటివి నీకు ఇంకా ఎన్నో ఉన్నాయన్నారు. అనిల్ నువ్వు ఇప్పటి వరకు ప్రజాధనాన్ని దోచుకున్నావని లోకేష్ ఇప్పటి వరకు ఎలాంటి అవినీతికి పాల్పడలేదన్నారు. నీరాజకీయ ఓనమాలు దిద్ది, నిన్ను మనిషిగా మలిచి కార్పొరేటర్,మ్మెల్యేగా చేసిన నీ చిన్నాయన చెపుతున్నాడు నీగురించి, మా ప్రభుత్వంలో ఎక్స్‌సెస్, నీ ప్రభుత్వంలో రివర్స్ టెండరింగాని పేర్కొన్నారు. సర్వేపల్లి కాలువ, నగరంలో నువ్వు మంత్రి, మాజీ మంత్రిగా పెన్నా పొర్లు కట్టలు, హైలెవల్ కాలువ టెండర్ గురించి, అవినీతి గురించి, బెదిరింపులు గురించి మీ పార్టీ ఏంపీ ఆదాల.ప్రభాకర్‌రెడ్డి చేత నీకు దమ్ముంటే చెప్పించని రవిచంద్ర సవాల్ చేశాడు. సోమశిల లింక్ కాలువ, కావలి కాలువ, నార్త్ ఫీడర్, టీడీపీ హయాంలో వెంకయ్యనాయుడు సహకారంతో అటవీ అనుమతులు తెచ్చామన్నారు. నువ్వు ఒక అసమర్థుడివి, అసమర్థ ప్రభుత్వం మీదన్నారు. అటువంటి నువ్వు లోకేష్‌ని విమర్శిస్తావని మండిపడ్డాడు. నీకు దమ్ముంటే రా టీడీపీ ఏమి చేసిందో, వైసీపీ ఏమి చేసిందో రివర్స్ టెండరింగ్ పేరుతో జ్యుడిషియల్ కమిషన్ పేరుతో ఈ రాష్ట్రంలో జరుగుతున్న దోపిడీ చేశారో ఆధారాలతో నిరూపించేందుకు మేము సిద్ధంగా ఉన్నామని బీద తెలిపారు. జగన్ పార్టీ పెట్టి 10ఏళ్ళు అయింది ఆయన ఎక్కడ బహిరంగ సభకు పోయినా తెలుగు కూడా సరిగా చదవలేని ఒక దద్దమ్మ ముఖ్యమంత్రని, నువ్వా లోకేష్ సరిగా మాట్లాడలేడని అనడం సరికాదని హితవు పలికారు. నీ సీఎంకి భాష, పథకాల గురించి, సమావేశాలకి పోతే తత్తరబిత్తరగా మాట్లాడకుండా సరిగా చెప్పేలా చూసుకోండని ఉద్ఘాటించారు. లోకేష్ పాదయాత్రతో వైసీపీ గడగడలాడుతోందని, జీవో నంబర్ ఒకటి తెచ్చి పాదయాత్ర నీరు గార్చేందుకు ఎన్నో చేసినా ,ప్రజలను సైతం బయటకి రాకుండా అడ్డుకు నేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా, పోలీసులను అడ్డం పెట్టుకున్నా రాయలసీమలో ఎన్టీఆర్ మనవడిగా, చంద్రబాబు బిడ్డగా కాకుండా, ఈ రాష్ట్రానికి కాబోయే భవిష్యత్తు నేతగా లోకేష్ పాదయాత్రకి నీరాజనాలు పడుతున్నారన్నారు. నీకు సీటు రాకుండా చేసేందుకు నువ్వే చెప్పుకుంటున్నావని నువ్వు ఇలాగే మాట్లాడే తిరిగి అందరూ కూడా నిన్ను ఇలాగే మాట్లాడతారని మాట్లాడే ముందు నోర అదుపులో పెట్టుకుని మాట్లాడాలని రవిచంద్ర హితవు పలికారు.

# వ్యవసాయశాఖ అధికారులు తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

### ఫోటోలు తప్ప రైతులకు ప్రయోజనం శూన్యం
### రైతులను పక్కనపెట్టి అనుచరులతో అవగాహన సదస్సు

**ఉలవపాడు, జూన్24, ప్రభాతవార్త** మండలపరిధిలోని కరేడు పంచాయతీ అలాగాయపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన వేరుశనగ రైతుల అవగాహన కార్యక్రమం మొక్కుబడిగా సాగింది .జిల్లా స్థాయి అధికారులు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వచ్చినప్పటికీ కనీసం రైతులకు సమాచారం అందించకుండా సచివాలయం పక్కనే ఉన్న నలుగురు,ఐదుగురు రైతులను పిలిపించి వారికి ఏదో అవగాహన కల్పించినట్టు ఫోటోలు పెట్టి ప్రజాధనాన్ని వ్యర్థం చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు అపహాస్యం పాలు చేస్తున్నారు. ఇది గతంలో పలుమార్లు జరిగినప్పటికీ వాళ్లతీరులో మార్పు రాలేదు. కనీసం రైతుల అనేవాడు వాడి సాధక బాధకాలను సాగు చేయడంలో వచ్చేటువంటి ఇబ్బందులను శాస్త్రవేత్తలకు చెప్పుకునే అవకాశం లేకుండా వచ్చిన దారినే వారిని పంపిస్తూ రైతులకు పై అధికారులకు మధ్యగా మండల అధికారులు అడ్డుకట్టగా నిలుస్తున్నారు. సచివాలయ పరిధిలో సుమారు 700ఎకరాలు వేరుశనగ సాగు చేస్తున్నప్పటికీ కనీసంలో కనీసం ఏడుగురు రైతులు కూడా అక్కడ లేకపోవడం హాస్యాస్పదంగా అనిపిస్తుంది. ఈ మండల వ్యవసాయశాఖ అధికారులు రాకపై ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారు, ఆ గోప్యతకు కారణాలు తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టేలా అందరు

రైతులను పాలుపంచుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని అలా కానీ నామమాత్రపు కారక్యక్రమాల వల్ల ప్రయోజనం లేదని చర్చించుకుంటున్నారు. కావున అధికారులు స్పందించి తగుచర్యలు చేపట్టి రైతులకు మేలు చేసే కార్యక్రమాలుచేపట్టాలని కోరుకుంటున్నారు.

# దివ్యాంగులకు స్కూటర్లు అందజేసిన ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దివ్యాంగులకు స్కూటర్లు మంజూరు చేసిందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన నివాసంలో కావలి నియోజకవర్గంలోని దివ్యాంగులకు స్కూటర్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను మరి ముఖ్యంగా పేదల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని సంక్షేమ పథకాల ఫలాలు అందజేస్తున్నారన్నారు. నేడు దివ్యాంగులకు కూడా స్కూటర్లు అందజేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు.

ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, దగదర్తి మండల అధ్యక్షులు ప్రసాద్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమికి మహిళల భిక్షాటన



వరికుంటపాడు, జూన్ 24, ప్రభాతవార్త: వచ్చేనెల 3వతేదీన గురుపౌర్ణమి సందర్భంగ వరికుంటపాడునందువున్న శ్రీసాయినాదుని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుండడంతో స్థానిక మహిళలు,ఆలయ కమిటి సభ్యులు బిక్షాటన చేశారు. వరికుంటపాడు పంచాయతిలోని అంద్రవారిపల్లి ,వరికుంటపాడు గ్రామలలో ఇంటింట తిరుగుతు చందాలు వసూలు చేశారన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఎంఇఒకు ఘన సన్మానం

వింజమూరు, జూన్23ప్రభాతవార్త: మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై కరటంపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడుగా వెళ్ళిన ఈసా మాలకొండరావ్‌కు మండల ఉపాధ్యాయులందరూ శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ నల్లగొండ్ల సృజన, ఎంపిడిఒ రాజేష్ , మండల ఎంఇఒ-2 మధుసూధన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎంఇఒ గా మాలకొండరావ్ విధులు నిర్వహించిన 6సంవత్సరాల కాలంలో ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా ఎక్కడా రాజీ పడకుండా ప్రభుత్వం సూచించిన విధంగా విధులు నిర్వహించి ఉత్తమ అధికారిగా పేరు సంపాదించుకున్నా రన్నారు. పాఠశాల నిర్వహణ పట్ల , ఉపాధ్యాయుల బోధనను అనునిత్యం పర్యవేక్షిస్తూ సూచనలు, సలహాలు ఇస్తూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మెరుగైన విద్యాబోధన చేశారని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేద ప్రజలందరికి ప్రతి పథకం వర్తించేలా జగనన్న సురక్ష



కావలి, జూన్ 24 ప్రభాతవార్త పేద ప్రజలందరికి జగనన్న ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం వర్తించేలా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి మున్సిపల్ కార్యాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమం నెల రోజుల వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేకాధికారులుగా కావలి ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌ను నియమించడం జరిగిందన్నారు. అలాగే కావలి రూరల్ మండలానికి ప్రత్యేకాధికారులుగా తహాశీల్దార్ మాధవరెడ్డి, ఎంపిడివోలను నియమించడం జరిగిందన్నారు. ఈ అధికారులు ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించే విధంగా చర్యలు చేపడతారన్నారు. అనంతరం కావలి పట్టణ 30వ వార్డులో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వైసిపి నేతలతో ఇంటింటికి వెళ్లారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అన్న వివరాలు సేకరించారు. సమస్యలు వుంటే అధికారులు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ కిరణ్, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ బాబురావు,వైసిపి నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జనిగర్ల మహేంద్ర యాదవ్, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, కనమర్లపూడి వెంకట నారాయణ, పొనుగోటి అనూరాధ, గంధం ప్రసన్నాంజనేయులు, నాగేశ్వరమ్మ, షేక్ షాహుల్ హమీద్, మండలివెంకట కృష్ణారావు, పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష క్షేత్ర స్థాయి సర్వే తనిఖీ



**బిట్రగుంట, జూన్ 24 ప్రభాతవార్త** బోగోలు మేజర్ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది చేపట్టిన ఇంటింటి క్షేత్ర స్థాయి సర్వేను ఎంపిడివో అమ్మిశెట్టి సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు ప్రతి గృహానికి వెళ్లి నమోదు చేసుకున్న వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. జులై 1 నుండి నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ఎంపిడివో, డిప్యూటీ తహశీల్దార్ ఒక టీమ్‌గా, తహశీల్దార్, ఇవోపిఆర్‌డి మరొక టీమ్‌గా సచివాలయంను సందర్శించి జగనన్న సురక్ష కార్యక్రమంలో అవసరమైన ధృవీకరణ పత్రాలు అందిస్తారని ఎంపిడివో చెప్పారు.

## తమ్మినేని కృష్టయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతిభావంతులకు పురస్కారాలు



**బిట్రగుంట, జూన్ 24 ప్రభాతవార్త** బోగోలు మండలం పాతబిట్రగుంట వంటేరు చినబాబుల్‌రెడ్డి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తమ్మినేని కృష్టయ్య ఛారిటబుల్ ట్రస్ట్, గీతామయి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, గురుకుల పాఠశాలలో గడిచిన విద్యా సంవత్సరంలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు 5 వేల రూపాయల నగదు పారితోషకాన్ని తమ్మినేని కృష్టయ్య ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థల ఐక్యవేదిక అధ్యక్షులు తమ్మినేని పాండు అందజేశారు. పాతబిట్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పరుసు హేమంత్ మండల స్థాయిలో ప్రథమ, నియోజకవర్గ స్థాయిలో తృతీయ స్థానం పొందడంతో ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. 8 పాఠశాలలో ప్రతిభావంతులకు జరిగిన ఈ పురస్కార కార్యక్రమంలో ఎంఇవో జయమ్మ, సరస్వతి సమస్తుధ్యం మండల కమిటీ చైర్మన్ యం.ప్రసాదరావు, వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచ్‌తో పాటు విద్యాకమిటీ చైర్మన్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం దాత తమ్మినేని పాండు, కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎంఇవో జయమ్మను ఘనంగా సత్కరించారు.

## కుష్ఠువ్యాధినివారణ పట్ల అప్రమత్తంగా ఉండాలి



**వలేటివారిపాలెం జూన్ 21, ప్రభాతవార్త** కుష్ఠువ్యాధి నివారణ పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యాధికారిణి డా॥ మణిదీపిక వైద్యసిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఆవరణలో కుష్ఠువ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16వరకు ప్రతి కుటుంబాన్ని సందర్శించాలన్నారు. అన్నారు.కుష్ఠువ్యాధి లక్షణాలు గల రోగులను గుర్తించాలన్నారు.రోగ నిర్ధారణ పరీక్షల అనంతరం వారికి ప్రత్యేక వైద్యచికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలుతోపాటు ఇందుకు సంబందించిన పలు అంశాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పోకూరు డాక్టర్ శివసిద్దప్పనాయుడు, కమ్యూనిటీ హెల్త్ అధికారి పి.శివరామయ్య, సూపర్ వైజర్స్ బాలరాజు, విజయనిర్మల,కెతోరాతోపాటు ఏఎన్ఎంలు, ఆషావర్కర్లు పాల్గొన్నారు.

## నూతన మరుగుదొడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం



**కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త :** కోవూరు లోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులు ఆశిం చిన మేర మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడు తున్న విషయాన్ని పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి మల్లి కార్జున్‌రెడ్డి దృష్టికి రాగా ఈ మేరకు ఆయన శనివారం పాఠశాల ప్రాంగణంలో నూతన మ రుగుదొడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొత్తం 10 లక్షల వ్యయంతో వీటి నిర్మానానికి ప్రణాళికలు కూడా సిద్ధం చేశారు. ఇప్పటికే మంచి నీరు ఆశించిన మేర లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బోరు ఏర్పాటుకు యు ద్ధప్రాతిపదికన ట్రస్టు ద్వారా చర్యలు తీసుకున్నారు. త్వరలోనే ఈ నిర్మాన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి , తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను తల్లులు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో మంచి శిక్షణ కలిగిన ఉపాధ్యాయుల పరనయవేక్షణలో నాణ్యమైన బోధనను అందిస్తున్నామని, దీనిని విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కోవూరు మండలం గుమ్మలదిబ్బ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో శనివారం పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన నాణ్యమైన బోధనతో పాటు మధ్యాహ్నం విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. సువిశాలమైన పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు ఆడుకునేందుకు ప్రత్యేకమైన క్రీడావసతి కూడా ఉందన్నారు. ప్రస్తుతం నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని, ఇన్ని వసతులు ఉన్న ఈ పాఠశాలను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన వారందరికీ ప్రభుత్వ పథకాలతో పాటు ఇతర సేవలు యుద్ధప్రాతిపదికన అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా వలంటీర్లు, గృహ సారధులు, సచివాలయ ఉద్యోగులు సమిష్టి కృషి చేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు టి. పార్వతి అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామ సచివాలయంలో ఈ కార్యక్రమంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగి ఇప్పటికీ ప్రభుత్వ పథకాలు పొందని వారిని గుర్తించి వారంలోగా వారందరి జాబితాను సిద్ధంగా చేయాలన్నారు. జేసీఎస్ కన్వీనర్ కె. ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఇటువంటి మంచి అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని వారి ముంగిటికే ప్రభుత్వ పథకాలు అందించేలా చొరవ తీసుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, గ్రామ సర్పంచ్ ప్రమీలమ్మ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కళ్యాణి, సచివాలయ కన్వీనర్లు శ్రీనివాసులురెడ్డి, సుధీర్, తదితరులు ఉన్నారు.

## టోల్‌ఫ్రీ నెంబర్ 14500 సేవలు సద్వినియోగం చేసుకోవాలి




**కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు వారి వారి ప్రాంతాల్లో అక్రమ మద్యం నిల్వలు, బెల్టు షాపుల వంటివి లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్ఈబీ ఎస్సై టి. శ్రీనివాస్ అన్నారు. కోవూరులోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం సచివాలయ మహిళా పోలీసులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి వారి సచివాలయాల పరిధిలో ఎక్కడైనా అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్నా.. అక్రమ మద్యం నిల్వలు ఉన్నా ఇతరత్రా కార్యక్రమాలు చేపడుతుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజల్లో కూడా ఇటువంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించేలా దృష్టి పెట్టాల్సిన బాధ్యత సచివాలయ మహిళా పోలీసులకు ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సమాచారాన్ని అందజేయాలన్నారు. అదేవిధంగా ఎక్కడైనా మత్తు పదార్థాలు గానీ అక్రమ నిల్వలు గానీ ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్ 14500కు సమాచారం ఇచ్చేలా ప్రజల్లో చైతన్యం పెంచాలన్నారు.

## బాణాసంచా ప్రమదంలో మరణించిన గిరిజనులను ఆదుకోవాలి



**కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు పంచాయతీలోని విఘ్నేనశ్వరపురం గ్రామానికి చెందిన బి. శివ, సీహెచ్ రమేష్ అనే గిరిజన యువకులు గత నెల 27వ తేది చేజర్ల మండలం, మాముడూరు గ్రామంలోని సవకతోటలో బాణాసంచా తయారు చేస్తూ ప్రమాదవశాత్తు అది పేలి వీరిరువురు మరణించిన ఇంతవరకు వారికి ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదని బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు పి. శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కోవూరు మండలం పాటూరు విఘ్నేశ్వరపురం గ్రామంలోని వారి కుటుంబ సభ్యులతో శనివారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యువకుల మృతికి కారణమైన జయంత్‌రెడ్డి ఎటువంటి అనుమతులు లేకుండా బానాసంచా తయారు చేయడం వలన ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఈ ఘటన జరిగి నెల రోజులు కావస్తున్నా వారిని ఏ విధంగ ఆదుకోకపోగా కనీసం డెత్ సర్టిఫికేట్లు కూడా మంజూరు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని, వెంటనే ఈ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రఘురామయ్య, ఉపాధ్యక్షుడు పెంచలరెడ్డి ఉన్నారు.

## ఆయుర్వేదంపై మరింత అవగాహన పెంచుకోవాలి




**కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త** : ప్రస్తుతం సమాజంలో కొన్ని దీర్ఘకాలిక రోగాలు సైతం ఆయుర్వేద మందుల ద్వారా నయం అవుతుందని దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయుర్వేద వైద్యులు గంగాధర్ అన్నారు. కోవూరు మండలం గుమ్మలదిబ్బ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు , గ్రామస్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రపంచ దేశాలను సైతం గడగడలాడించిన కరోనా వ్యాధికి సంబంధించిన నయం చేసేందుకు ఆయుర్వేదంలో ఎన్నో మందులు ఉన్నాయన్నారు. ఎందరో ఈ మందులను ఉపయోగించుకుని కరోనా బారి నుంచి బయట పడ్డారన్నారు. పూర్వీకులు ఆయుర్వేదం ద్వారానే అనేక రోగాలను నయం చేసుకునే వార న్నారు. విద్యార్థులు కూడా ప్రథమిక దశ నుంచి ఆయుర్వేదంపై మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు.

**వైద్య శిబిరం విజయవంతం** స్థానిక గుమ్మలదిబ్బ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయుష్ శాఖ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం పూర్తిగా విజయవంతం అయింది. ఈ ఆయుర్వేదంలో ప్రధానంగా బీపీ, షుగర్, గ్యాస్‌ట్రబుల్ వంటి అనేక రోగాలను నయం చేసే మందులను ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గంగాధర్ పర్యవేక్షణలో గ్రామస్తులకు, రోగులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, ఆయుర్వేద సిబ్బంది ఉన్నారు.

## దొడ్ల కోదండరామిరెడ్డి దాతృత్వం అభినందనీయం



**బుచ్చి జూన్ 24 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెంలోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో దాత దొడ్ల కోదండరామిరెడ్డి పేద విద్యార్థులకు నోటిబుక్స్, ఇంగ్లీషు కమ్యునికేషన్ స్కిల్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా దొడ్ల కోదండరామిరెడ్డి మాట్లాడుతు శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్ 33 సంవత్సరాలు నుండి బుచ్చిరెడ్డిపాళెంలో క్రమశిక్షణ,దేశభక్తి నాణ్యామైనవిద్యను విద్యార్థులకు అందించడంలో నిరంతర కృషి చేస్తుందని అన్నారు. శ్రీగోపాలకృష్ణయ్య బుచ్చిరెడ్డిపాళెంలో విద్యాదాత అని కొనియాడారు. బెజవాడ,దొడ్ల కుటుంబంలో అందరు వారి వద్ద విద్యాభ్యాసం చేశారని అన్నారు. మాకు గురువుగారైన శ్రీగోపాలకృష్ణయ్య పాఠశాలలో విద్యార్దులకుఈవిధంగా సహాయ పడడం ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్ కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్ మాట్లాడుతు కోదండరామిరెడ్డి మొదటి నుండి పేదవారికి సహాయం చేయాలన్న తలంపు కలిగిన వ్యక్తి అని ఆయన కొనియాడారు. పేదవారికి ఎదో ఒక విధంగా ఎప్పుడు తన వంతు సహాయ సహకారాలు అందిస్తుంటారని తెలిపారు. కోదండరామిరెడ్డి దాతృత్వానికి నిర్వచనం అని అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గోన్నారు.

## విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఏకంకండి



**జలదంకి, జూన్24, ప్రభాతవార్త:** కేంద్ర కనుసన్నల్లో మెలుగుతు విద్యుత్ చార్జీలను ఎడాపెడా పెంచుతున్న రాష్ట్ర ప్రభుత్వం వైఖరికి వ్యతిరేకంగ పోరుసల్పేందుకు అందరు ఏకమవ్వాలని అఖిలపక్షం నేతలు పిలుపునిచ్చారు. శనివారం స్తానిక సురే చెంచురెడ్డి భవన్‌లో వామపక్ష,కాంగ్రేస్ పార్టీనేతలు సమావేశమై విద్యుత్ చార్జీల బాదుడుపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగ సి.పి.ఐ జిల్లానేత టి.మాల్యాద్రి మాట్లాడుతు ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు,సోలార్ విద్యుత్ పేరుతో వినియోగదారులపై మోయలేని భారం మోపుతుందన్నారు. అదానికి మేలుచేకూర్చేందుకు ఏపనికైన పూనుకుంటుందని అందులో భాగమే విద్యుత్ చార్జీల వడ్డనని అన్నారు. సంక్షేమపదకాలు,ప్రజాశ్రేయస్సంటు పైసలు విదిల్చి రూపాయలు దండుకుంటున్న చందాగ రాష్ట్ర ప్రభుత్వ తీరువుందని దుయ్యబట్టారు. దీనికి వ్యతిరేకంగ ఆందోళన చేపట్టేందుకు తాము కార్యాచరణ సన్నద్దమవుతున్నామని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక విదానాలను ఎండగట్టేందుకు ప్రజలు, యువకులు పెద్దఎత్తున మద్దతు తెలపాలని ఆయన కోరారు. కాంగ్రేస్ సీనియర్‌నేత వేలమూరి శివశేఖర్‌రెడ్డి మాట్లాడుతు విద్యుత్ చార్జీల వడ్డింపుపై త్వరలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సబ్‌స్టేషన్ల ముందు ఆందోళన చేపట్టేందుకు యాక్షన్‌ప్లాను ప్రకటిస్తామని అన్నారు. బి.జె.పి పాలిత రాష్ట్రాలలో కరంటు బిల్లులను ఉపసంహరించుకుంటుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆత్యుత్సాహం ప్రదర్శిస్తు బిల్లుల వసూలకు పూనుకుంటున్నాడని దుయ్యబట్టారు. పలురకాల చార్జీలపేరుతో ఇప్పటికి ఎనిమిసార్లు కరంటు వడ్డన జరిగిందని ఇది సరైన పాలకుడి చర్యకాదని తక్షణమే ఈభారాన్ని ఉపసంహరించుకొని ప్రజలకు మేలైన పాలన అందించాలని డిమాండ్ చేశారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు



**వరికుంటపాడు, జూన్24, ప్రభాతవార్త:** అర్హులైన అంద రికి ప్రభుత్వ పదకాలు అందించాలన్న లక్ష్యంతోనే ప్రభు త్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తహసిల్‌దార్ సయ్యద్ ఇక్బాల్,ఎం.పి.డి.ఒ విజయ భాస్కర్‌రావులు అన్నారు. శనివారం మండలంలోని జి కొండారెడ్డిపల్లి గ్రామంలో జగనన్న సురక్షలో భాగంగ వాలంటీర్లు,సచివాలయ సిబ్బందితో కలసి గృహాలను సందర్శించి సమస్యలు వున్నవారివద్దనుంచి పత్రాలను స్వీకరించారు. ఈసందర్భంగ తహసిల్‌దార్ సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతు జులై ఒకటినుంచి జగనన్న సురక్ష క్యాంపులను ఏర్పాటుచేయడం జరుగుతుందన్నా రు.ఏ దకాలకు సంబందించిన సమస్యలు వుంటేపరిష్కరించడంతోపాటు ఎలాంటి సేవారుసుములు లేకుండానే అవసరమైన సర్టిఫికేట్లను అందిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి శివకుమార్‌జూనియర్ అసిస్టెంటు రామకృష్ణారెడ్డి,వి.ఆర్.ఒ శేషారెడ్డి,వెల్ఫేర్ అసిస్టెంటు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజగోపాల్‌రెడ్డిని కలిసిన వింజమూరు వైసిపి నేతలు



**మర్రిపాడు, జూన్23 ప్రభాతవార్త:** వింజమూరు మండల వైసిపి నాయకులు శనివారం వైసిపి నేత మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని కలిశారు. మేకపాటి కుటుంబం స్వగ్రామమైన మర్రిపాడు మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఉదయగిరి నియోజకవర్గ ఆత్మీయ సమావేశాన్ని మాజీ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో వింజమూరు నేతలు హాజరయ్యారు. వైసిపి ఇన్‌చార్జ్ నియామక విషయంలో ప్రతిష్టంబన నెలకొన్న నాటినుండి నిన్నమొన్నటి వరకు కూడా పలువురు నేతలు ఇన్‌చార్జ్ పదవి కోసం పోటీ పడుతున్నారు. అయితే మేకపాటి రాజమోహన్‌రెడ్డి పట్టువదలని విక్రమార్కుడిలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వద్ద ఉదయగిరి నియోజకవర్గ పార్టీ బాధ్యతలు తమ కుటుంబానికే ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి తన సోదరుడే ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమింప బడతాడని చెప్పడంతో నేతలందరూ ఉత్సాహవంతులై బ్రాహ్మణపల్లి వెళ్ళి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నాయకులు, మాజీ కన్వీనర్ గువ్వల కృష్ణారెడ్డి, మాజీ సొసైటీ చైర్మెన్ మద్దూరు చిన్నికృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మండాది గోవిందరెడ్డి, వైసిపి ప్రచార కార్యదర్శి అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, సీనియర్‌నాయకులు రేవనూరు చినకొండారెడ్డి, సొసైటీ డైరెక్టర్ కొండపల్లి రమేష్, నాయకులు బయపురెడ్డి విజయకృష్ణారెడ్డి, వంగాల శ్రీనివాసులురెడ్డి, ఓంకారం రాజు, చీమల హజరత్‌రెడ్డి, మద్దూరి బాలకృష్ణారెడ్డి, మండాది గురుప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు



**ఆత్మకూరు, జూన్23ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామీణప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ప్రతి కుటుంబానికి అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికోరారు. శనివారం ఆత్మకూరు మండలం కరటం పాడు సచివాలయ పరిధిలోనిఆరవీడు,ఆరవీడు జంగాలపల్లి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఉదయగిరి వైసిపి నాయకులు మేకపాటి రాజగోపా ల్‌రెడ్డికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. తొలుత గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి అనంతరం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి ముఖ్యమంత్రి అంజదేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు.

అనంతరం గ్రామంలో ముమ్మరంగా పర్యటించి గ్రామస్తులనుండి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జగనన్న సురక్ష పథకంగురించి వివరించారు వైద్యులు శేషయ్య అనే వృద్ధు డు తనకు పెన్షన్ రావడంలేదని ఎమ్మెల్యేను కోరగా వెంటనే స్పందించి తన సొంత సొంత నిధులను ఎమ్మెల్యే అందజేశారు. వచ్చే నెల నుండి తప్పక పింఛను వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపిడిఓ ఐజాక్‌ప్రవీణ్, ఎంపిఇకేతా వేణుగోపాల్‌రెడ్డి, రూరల్ వైసిపి కన్వీనర్ జితేంద్రనాగ్‌రెడ్డి, ఆత్మకూరు రూరల్ జెసిఎస్‌కన్వీనర్ ఎం.రాజేంద్రనాయుడు, మండల అధికారులు, వైసిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాలకొండ ఆదాయం రూ.13.7లక్షలు



**వలేటివారిపాలెం జూన్ 24, ప్రభాతవార్త** మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనర సింహ స్వామివారిని శనివారం పలువురు భక్తులు దర్శించు కున్నారు. ఈ శనివారం సా ్వమివారికి రూ.13,70,801 మేర ఆదాయం సమకూరింది. ఆలయ ప్రధాన అర్చకులు గౌరీశంకర్, నరసింహాచార్యులు భక్తులకు తీర్థప్ర సాదాలు అ ందచేశారు.భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.6,900లు, కుంకు మార్చన పూజల ద్వారా రూ.26,520లు,తలనీలాలు టిక్కెట్లు వలన రూ.55,850లు,వాహన పూజలు రూ.5,440లు, ప్రత్యేకదర్శనం రూ.2,69,700లు, స్థలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ.740 లు,రూముల అద్దెలు రూ.30,040లు,కవర్లు అమ్మకం వలన రూ.6,600లు,అన్నదానం నిమిత్తం రూ.3 ,30,611లు లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.2,02,350లు,విరాళాలు వలన రూ.4,36,050 మేర స్వామి వారికి భక్తులు సమర్పించారు. ఆలయ ఏసీ కె.బి శ్రీనివాసరావు భక్తులకు దర్శన ఏర్పాట్లును పర్యవేక్షించారు. ఉదయం 10.30గ॥ నుంచి మధ్యాహ్నం 3గం॥ వరకు ఉచిత అన్నదాన ప్రసాదం అందచే శా రు.అన్నదాన కార్యక్రమంతోపాటు దర్శనక్యూ, అన్నదాన క్యూ, తలనీలాల క్యూ, లడ్డుకౌంటర్ క్యూలోని భక్తులకు అందుతున్న సేవాకార ్యక్రమాలను ఆలయ అధికారి కె.బి శ్రీనివాసరావు పర్యవేక్షిం చారు.వలేటివారిపాలెం మండల పోలీసులు ప్రధాన కూడళ్లలో నిర్విఘ్నంగా విధులు నిర్వహించారు.

## అనిల్... నోరు అదుపులో పెట్టుకో

**నెల్లూరు జూన్ 24, ప్రభాతవార్త-వైద్యం** మద్రాసు నగరంలో నగర ప్రజల దగ్గర దోచుకున్న ధనంతో ఒక విల్లాని కొని అక్కడ విలాసాల్లో మునిగితేలుతూ, చీకటి బ్రతుకు బ్రతుకుతూ నిజాయితీ పరుడైన మా యువనేత లోకేష్‌ని ఒరేయ్ అని అనడం సరికాదని, మరోసారి ఒరేయ్ అని సంబోధిస్తే నీనాలుక చీరేస్తానని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్‌ని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి. శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. శనివారం నగరంలోని టీడీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించాడు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ నగర శాసనసభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 50వేలతో ఓట్లతో ఓడిపోవడం తథ్యమని జోస్యం చెప్పారు. సర్వేపల్లి కాలువ దగ్గర నుంచి పోలవరం దాకా దాదాపు రూ.3వేల కోట్ల పైచిలుకు అనిల్ దోచుకున్నాడని దీనిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని, అనిల్ చర్చకు నువ్వు సిద్ధమాని కోటంరెడ్డి సవాల్ విసిరారు. సంగం బ్యారేజీని పూర్తి చేసింది తాము నారాయణ సారథ్యంలో సుమారు 99శాతం పనులను పూర్తిచేశామన్నారు. టీడీపీ హయాంలో మేము పూర్తి చేసిన ఇళ్ళను నిర్మిస్తే వాటిని బ్యాంకు రుణాలను పొందిన పేదలకు ఆ గృహాలను ఇవ్వలేని దద్దమ్మవి నువ్వని విమర్శించారు. ఫ్లైవర్ బ్రిడ్జి దగ్గర తొడకొట్టి ఏడాదిలో పూర్తి చేశామని, టైమర్ పెట్టాడని అది ఎక్కడ ఉందో తెలియదుకాని అక్కడ దుమ్ము, ధూళి మాత్రం ప్రజల కళ్లలో కొడుతున్నాడన్నారు. పెన్నానదిలో ఇసుకను నీ అనుచరులతో రూ.100కోట్లు దోచుకోలేదాని ప్రశ్నించాడు. సర్వేపల్లి కాలువ వద్ద రక్షణ గోడ నిర్మిస్తానని చెప్పి, ఇద్దరు మహిళల ప్రాణాలను తీసి దుర్మార్గుడివన్నారు. ఈ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కరోనా సమయంలో 10 ఆసుపత్రులను లీజుకి తీసుకుని నీ తమ్ముడితో కోట్లాది రూపాయలను దోచుకునింది నువ్వు కాదాని ఒరేయ్ అనిల్ నువ్వు కాదాని సూటిగా ప్రశ్నించారు. లోకేష్, నారాయణ, నారాయణ కూతురులని విమర్శించే స్థాయి నీది కాదని, త్వరలోనే అనిల్ నువ్వు అంతకంతకు అనుభవించే చేస్తానని శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. లోకేష్ ఒక మహాశక్తి గుర్తుపెట్టుకోమన్నారు. నీలాగా క్రికెట్ బెట్టింగ్‌లకు మహారాజు కాదని, నగరాన్ని గంజాయికి అడ్డాగా చేసిన ఘనుడువి నువ్వు, నువ్వా లోకేష్‌ని విమర్శించేదని దుయ్యబట్టాడు. అనిల్ లాగా లోకేష్ అవినీతిపరుడు కాదని, నీతి నిజాయితీపరుడు లోకేష్‌ని కొనియాడారు. నగరంలో పోలీసు వ్యవస్థ ఒన్‌సైడని, అనిల్ పోలీసులకు ఏమి చెపితే అదే అన్నారు. ఇక్కడ ప్రజా పరిపాలన ఉందాని కోటంరెడ్డి ప్రశ్నించారు. మీ బాబాయి, నుడా చైర్మన్‌ల మీద ఒక బటన్ నొక్కితే వాళ్ళ భాగోతం బయటపడతాయని చెపుతున్నావని, అసలు అందులో నీవాటా ఎంతుందో తెలుస్తుందని, నీ అవినీతికి కూడా బయట పడుతుందనే ఆ బటన్ నొక్కడాన్ని ఆరునెలల నుంచి ఆపుకుంటున్నాడన్నారు. అభివృద్ధి మీద నీ అవినీతిపై చర్చకు దమ్ముంటే రమ్మని శ్రీనివాసులురెడ్డి అనిల్‌కి సవాల్ విసిరాడు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు మామిడాల.మధు, ఉచ్చి.భువనేశ్వర్‌ప్రసాద్, జహీర్, ప్రశాంత్, పసుపులేటి.మల్లిఖార్జున

## ఏరియా వైద్యశాల రోగులకు మెరుగైన సేవలందించాలి



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త** కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వచ్చే ప్రతి రోగికి ఉన్నత వైద్య సేవల తో పాటు మెరుగైన వైద్యం అందించి పేదల ప్రశంసలు అందుకోవాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతా ప్‌కుమార్‌రెడ్డి వైద్యులను ఆదేశించారు. శనివారం కావలి ఏరియా వైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. ప్రతి డాక్టర్‌తో ఆయన వన్ టు వన్ చర్చలు జరిపారు. ఈ వైద్యశాలలో వున్న సమస్యల్ని స్వయంగా అడిగి తెలుసు కున్నారు. వైద్యశాలలోని రోగులను పరామర్శించి వైద్య సేవలపై వాకబు చేశారు. అనంతరం అందరి డాక్టర్లతో సమావేశమై పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. దీర్ఘకాలికంగా మెరుగైన వైద్య సేవలందించి, వైద్యశాల అభివృద్ధికి పాటుపడి ఎన్నో అవార్డులు, రివార్డులు వైద్యశాలకు తెచ్చి పెట్టిన డాక్టర్ కామంచి సుబ్బారావు సూపరింటెండెంట్‌గా వ్యవ హరిపస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేయడం జరిగిందన్నారు. ఆయన స్థానంలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్‌గా పద్మావతి బాధ్యతలు చేపట్టారన్నారు. ఈ ఏరియా వైద్యశాలలో నిత్యం వెయ్యి లోపల రోగుల ఓపి వుందన్నారు. వైద్యశాల ఆవరణలో త్వరితగతిన నూతన భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. వైద్యశాలకు కావాల్సిన పరికరాలు ఏమైనా వుంటే సమకూరుస్తామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు బాధ్యతాయుతంగా అంకితభావంతో రోగులకు సకాలంలో సరైన వైద్యసేవలందించాలన్నారు. అందరికి మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ వైద్యశాలలో నూతన ప్రసూతి భవనాన్ని కూడా నిర్మిస్తామన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు అధునాతన సౌకర్యాలతో మెరుగైన వైద్యం అందిస్తున్నారన్న నమ్మకం ప్రభుత్వ వైద్యులు కల్పించాలన్నారు. ఫిర్యాదులు అందితే కుదరదన్నారు. రాత్రి వేళలలో సెక్యూరిటీ కల్పించాలని డాక్టర్లు కోరడం జరిగిందన్నారు. కావలి డీఎస్పీ వెంకట రమణతో చర్చించి వైద్యశాల ఆవరణలో పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటుకు చర్యలు చేపడతానన్నారు.

**5 ఎకరాలలో అధునాతన ఏరియా వైద్యశాల...** కావలి ప్రాంతం చుట్టుపక్కల ప్రజల జనాభా పెరుగుదలను బట్టి 5 ఎకరాలలో కావలి ఏరియా వైద్యశాలను అధునాతన సౌకర్యాలతో నిర్మించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఈ వైద్యశాల సరిపోవడం లేదన్నారు. అందుచేత కావలి టోల్‌గేటు సమీపంలో జాతీయ రహదారిపై కానీ ముసునూరు సాయిబాబా గుడి సమీపంలో ఐదు ఎకరాల స్థలం సేకరించి నూతన ఏరియా వైద్యశాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారన్నారు. పేదలకు మంచి వైద్యం అందించాలన్నదే తన ధ్యేయమన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి, మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ కామంచి సుబ్బారావు, ఆర్‌యంవో డాక్టర్ ప్రసాద్, ఏరియా వైద్యశాల అడ్వైజరీ కమిటీ బాధ్యుడు కలికి శ్రీహరిరెడ్డి, సభ్యుడు తంగుటూరి శివప్రసాద్, వైసిపి నేతలు దామిశెట్టి సుధీర్‌నాయుడు, షాహుల్ హమీద్,అయ్యవారు కృష్ణారెడ్డి, పర్వీన్‌జానీ, నాగేశ్వరమ్మ, డాక్టర్లు పాల్గొన్నారు.



## విట్స్‌లో ఘనంగా ముగిసిన అంతర్జాతీయ సదస్సు



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని పిబిఆర్ విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాలలో కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్‌లో ప్రస్తుత పురోగతి' అనే అంశంపై శనివారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సు ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగం వారు నిర్వహించారు. సదస్సులో వివిధ దేశాలు అలాగే మన దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పరిశోధకులు సమర్పించిన పత్రాలపై క్షుణ్ణంగా చర్చ నిర్వహించారు. దాదాపు వందకు పైగా పరిశోధకులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పాల్గొని తమ పరిశోధన పత్రాలను ప్రదర్శించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిధిగా ఐఐటి తిరుపతి నుంచి విచ్చేసిన డాక్టర్ విక్రమకుమార్ పూడి 5జీ టాక్నాలజీ ఆవిర్భావం వల్ల ప్రయోజనాలు, మన జీవన విధానంపై 5జీ ప్రభావాన్ని వివరించి మాట్లాడారు. రాబోవు రోజుల్లో డ్రైవర్ లేని వాహనాలతో రోడ్డు ప్రమాదాలు లేని సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. ముఖ్యవక్తగా వెల్లూరు ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి విచ్చేసిన డాక్టర్ విజేంద్రబాబు మాట్లాడుతూ ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చేసిన టెక్నాలజీతో తనంతట తానే పనిచేసే తెలివైన ఐవోటి విధానాలు ప్రజా జీవనాన్ని సుఖవంతంగా మార్చనున్నట్లు తెలిపారు. అధ్యాపకులు, పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపై అనుసంధానం చేయడానికి ఇటువంటి అంతర్జాతీయ సదస్సులు ఎంతగానో ఉపయుక్తంగా వుంటాయని విభాగ ధిపతి డాక్టర్ ఆర్.స్రవంతి తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఈసిఈ విభాగ అధ్యాపకులు, నిర్వాహకులను ప్రిన్సిపాల్ డాక్టర్ దత్తాత్రేయ శర్మ అభినందించారు. కార్యక్రమంలో కోకన్వీనర్లు డాక్టర్ హయాత్‌రజ్వీ, డాక్టర్ వెంకటేషన్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ వి.వి.సునీల్‌లు పాల్గొన్నారు.

## పనిచేసే అధికారికి పదోన్నతి తధ్యం



**కోవూరు జూన్ 24 ప్రభాతవార్త** ప్రజా సమస్యల పరిష్కారంలో సమర్ధవంతంగా పనిచేసే అధికారులకు పదోన్నతి తధ్యమని అందుకు నిదర్శనం ఇఒపిఆర్‌డిగా పనిచేస్తు ఎండిఒగా బదలీ అయిన కల్పన అందుకు నిదర్శనమని రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యులు డి .నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు.కోవూరులోని మండల పరిషత్ సమావేశం మందిరంలో సోమవారం రాత్రి కోవూరు ఇఒపిఆర్‌డిగా పనిచేస్తు పదోన్నతిపై ప్రకాశం జిల్లాకి ఎంపిడిఒగా పదోన్నతి పొందిన కల్పనను మండల పరిషత్,పంచాయితీరాజ్,స్ధానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర ్బంగా ఆయన మాట్లాడుతు గతంలో వచ్చిన కరోనా, ఇటీవల వచ్చిన వరదలలో ఇఒపిఆర్‌డిగా పనిచేసిన కల్పన ఎంతో ధైర్యసాహసాలతో అధికారులు ప్రజాప్రతినిదుల చొరవతో సమర్ధవంతగా పనిచేశారని అన్నారు.ఈ నాలుగు సంవత్సరాల పదవికాలంలో ఉన్నతాధికారుల వద్ద మంచి పేరు సంపాదించుకొని సమస్యల పరిష్కారాంలో నేర్పుగా వ్యవహారించడం కల్పనకే సాధ్యమని అటువంటి వారిని సచివాలయ ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో ఎంపిపి పి పార్వతీ, ఉపాధ్యాక్షులు నరసింహులురెడ్డి,సొసైటీ చైర్మన్ ఆర్ మల్లికార్జునరెడ్డి,ఎంపిడిఒ శ్రీహరి,పంచాయితీ కార్యదర్శులు కృష్ణమూర్తి,చందనలు ప్రసంగించారు.కల్పనను మాజీగజమాల, శాలువ,మెమొంటోలతో ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ,సర్పం చ్‌లు,పంచాయితీ కార్యదర్శలు,వెలుగు ఉద్యోగులు,సిబ ్బంది ఉన్నారు.

## యువత మాదకద్రవ్యాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



**కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త :** కళాశాలలో చదివే యువత మత్తు పదార్థాల జోలికి పోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఈబీ సీఐ నరహరి అన్నారు. కోవూరులోని టీఎన్‌సీ కళాశాల ప్రాంగణంలో శనివారం కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం, తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో చదివే యువత ఈ వయస్సులో కేవలం చదువుపైనే దృష్టి సారించేలి తప్ప మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదన్నారు. దీని వలన వారి భవిష్యత్తు పూర్తిగా అవధకారం అవుతుందన్నారు. తద్వారా వారిని నమ్ముకున్న కుటుంబాలు సైతం వీధిన పడే పరిస్థితి వ స్తుందని , దీనిని దృష్టిలో పెట్టుకుని కళాశాలలో చదివే యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా స న్మార్గంలో పయనించాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఎస్సై టి. శ్రీనివాస్, కళాశాల ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు. అనంతరం కోవూరు పురవీధుల్లో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు.

## "జెనెక్" విద్యార్థులను అభినందించిన విఎస్‌యూ వీసీ



**నెల్లూరు,జూన్24 ప్రభాతవార్త-విద్య** ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ప్రతిబ కనపరిచి ఉద్యోగాలకు ఎంపికైన నగరంలోని స్థానిక హరనాధపురం జెనెక్స్ విజన్ కళాశాల విద్యార్థులను విక్రమసింహపురి విశ్వ విద్యాలయం వైస్‌ఛాన్సిలర్ ఆచార్య సుందరవల్లి అబి.నందించారు. ఉద్యోగాలు ఎంపికైన విద్యార్ధులతోపాటూ కళాశాల డైరెక్టర్లు ఎన్.వెంగళరెడ్డి, పి.కొండలరావులు శనివారం వీసీని ఆమే కార్యాలయంలో మర్యదపూర్వకంగా కలుసుకున్నారు.వీసీ మాట్లా డుతు విద్యార్థులు దృడసంకల్పంతో , క్రమశిక్షణలతో కూడిని విద్యను అభ్యసించటం ద్వారా ఇటువంటి ఉత్తమ ఫలితాలు సాధించి విజేతలుగా నిలువటం జరుగుతుందన్నారు.విద్యార్ధులను విజయపదంలో నడిపేలా కృషిచేసిన కళాశాల డైరెక్టర్స్‌ను ఆమే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కళాశాల డైరెక్టర్స్ మాట్లాడుతు తమ విద్యార్థులు బివి.పూజ, ఎం.వేణుగోపాల్‌లు 18 లక్షల ప్యాకేజి కవశం చేసుకోవటం సంతోష దాయకమన్నారు. తమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు డిగ్రీతో పాటూ సమాంతరంగా సిఎంఎ కోర్సును కూడా బోధించటం జరుగుతుందన్నారు. కేవలం 20 సంవత్సరాల వయస్సులోనే డిగ్రీ పూర్తి అయ్యేసరికి రూ.18లక్షల ప్యాకేజీని సాధించే స్థాయికి తమ విద్యార్థులు ఎదగటం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించేందుకు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షా పథకం ప్రారంభం



వింజమూరు, జూన్ 23 ప్రభాతవార్త: వింజమూరు మండలం బుక్కాపురంలో శనివారం జగనన్న సురక్షా పథకాన్ని ఎంపిడిఒ రమేష్‌బాబు, తహసిల్దార్ చొప్పా రవీంద్రబాబు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలను అందిస్తారన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ రిజిస్ట్రేషన్, కుటుంబ సభ్యుల ధృవీకరణ , ఆధార్‌కు ఫోన్‌నెంబర్ లింక్‌చేయడం, భూములకు సంబంధించిన మ్యుటేషన్ , చేర్పులు, మార్పులు , రేషన్‌కార్డు మంజూరు, తొలగింపు తదితర 11రకాల సేవలను అందిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈపథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. జులై 1నుండి సర్వే ప్రారంభమవుతుందన్నారు. ఇంటింటి సర్వే ఉంటుందనా న్నరు. ఈకార్యక్రమాన్ని కావలి డిఎల్‌పిఒ సుస్మితారెడ్డి పరిశీలించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ఎ.శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి విజయమ్మ , సర్పంచ్ సి.హెచ్.రసూల్, ఉపసర్పంచ్ కాటంరమణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పెంచలకోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణం



**పెంచలకోన(రాపూరు), జూన్24ప్రభాతవార్త** ప్రముఖపుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు.ఇందులో బాగంగా తెల్లవారుజామున 4 గంటలకు స్వామి వారి మూల మూర్తికి అభిషేకం,గోపూజ నిర్వహించారు. అనంతరరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం నిర్వహించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10.30 గంటకు స్వామి వారి కళ్యాణమండపంలో స్వామి వారికి ఉభయదేవేరులతో కళ్యాణ మహోత్సవాన్ని వేదపండితులు,వేదమంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా భాజా భజంత్రీల మధ్యనిర్వహించారు. సాయంత్రం చెంచులక్ష్మీ,ఆదిలక్ష్మీ సమేత పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారిని తిరుచ్చిపై వుంచి, మంగళవాయిద్యాలు,గిరిజనుల వాయిద్యాల మధ్య తిరుచ్చి ఉత్సవం నిర్వహించి,సహస్ర దీపాలంకరణ మండపంలో వుంచి స్వామి,అమ్మవార్లకుఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటగిరికి చెందిన మహిళా భక్తులు చేసిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిని భోజనవసతీ ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి,సహాయక కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆలయ సిబ్బందిపర్యవేక్షించారు.

## ఈ నెల 26నుండి బస్సు యాత్ర



**కందుకూరు,జూన్24,ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి బస్సు యాత్ర ప్రారంభిస్తున్నట్లు కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు.ఈ నెల 26వ తేదీ సోమవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు గుడ్లూరు చేరుకుంటుదని,అనంతరం 5గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం పార్టీ నేతలు అంతా పల్లెనిద్ర కార్యక్రమం చేపడతారని తెలిపారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులతో పాటు ప్రకాశం,నెల్లూరు జిల్లాల పార్టీ ముఖ్యనేతలు హాజరవుతారని చెప్పారు.మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రధానంగా యువకులు,మహిళలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చేలా పార్టీ నాయకులు కృషి చేయా లని ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు.ఈ సమావేశంలోనాయకులు పువ్వాడి వేణుగోపాల్,చిత్తారి మల్లికార్జున,నియోజకవర్గ బిసిసెల్ అధ్యక్షుడు మద్దసాని కృష్ణ,తిరుపతి వెంకయ్య,క్లస్టర్ ఇంచార్జ్ సుబ్బారావు,మహిళా కమిటి అధ్యక్షురాలు రమణమ్మ,నాదెండ్ల వెంకట సుబ్బారావు, ఇంకా పలువురు నాయకులు హాజరైయ్యారు.

## హర్‌దిల్ మే వైయస్సార్ హమ్‌సబ్ జగన్‌కే సాత్



**కందుకూరు,జూన్24,ప్రభాతవార్త** కందుకూరు పట్టణంలోని జనార్ధనకాలనీలో మదీన మసీదులో హర్‌దిల్ మే వైయస్సార్ హంసబ్ జగన్‌కే సాత్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వక్‌బోర్డ్ సభ్యులు సంధాని భాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి అధ్వర్యంలో ఈ కారక్రమంనిర్వహిస్తున్నామన్నారు.ఇమాన్ మౌజన్ల గౌరవవేతనం,మసీదుల్లో మౌళిక వసతులు కల్పనపై నివేదికను ఇచ్చామన్నారు.ఇప్పటికే మసీదుల్లో ఇమామ్ మౌజన్ల గౌరవ వేతనం ప్రభుత్వం అందిస్తుందన్నారు.మరికొన్ని మసీదుల్లో ఇమామ్లకు మౌజనులకు గౌరవ వేతనం ఇవ్వాలని ముస్లిం సోదరులు వినతిపత్రాలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైయస్సార్‌సీపి పట్టణ అధ్యక్షులు రఫీ,యువనాయకులు రహీం,మస్తాన్,బాబు,మసీదు కమిటీ సభ్యులు అబ్దుల్ కరీం,జహంగీర్,మహబూబ్‌భాషా,పాల్గొన్నారు.

## రాక్షసపాలనకు చరమగీతం



**వింజమూరు,జూన్23ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న రాక్షసపాలనను అంతమొందించేందుకు ప్రజలు సంసిద్ధమై ఉన్నారని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. శనివారం వింజమూరులో తెలుగుదేశంపార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచకాలు రాజ్యమేలుతున్నాయన్నారు. ఈపరిణామాలతో వైసిపి తీరుపట్ల ప్రజలు విసిగిపోయారన్నారు. ఈరాష్ట్రంలో సుపరిపాలన ఒక్క తెలుగుదేశంపార్టీకే సాధ్యమవుతుందన్నారు. ప్రజలు ఇప్పుడిప్పుడే తేరుకొని తెలుగుదేశంవైపు ఆకర్షితులవుతున్నారన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని 143గ్రామ పంచాయతీల్లో టిడిపి తిరుగులేని శక్తిగా రూపొందించేందుకు ప్రతి గ్రామంలో పర్యటిస్తూ నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు. నెల్లూరుజిల్లాలో యువగళం పాదయాత్రకు అన్ని వర్గాల నుండి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. జులై మొదటివారంలో ఉదయగిరి నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్రకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో జరిగే యువగళం పాదయాత్రను విజయవంతం చేసేందుకు నేతలతో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి జిల్లాలోనే కనివిని ఎరుగని రీతిలో ఉదయగిరిలో యువగళం పాదయాత్ర జరుగుతుందన్నారు. తమ అధినేత రాష్ట్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా 7పదుల వయసులోను అధికార పార్టీతో అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రజల్లోకి వెళుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఏనాడో పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తిచేసి ప్రజలకు అంకింతం చేసి ఉండేవారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు వైసిపి ప్రభుత్వం రాజధాని నిర్మాణ విషయంలో ఆనాడు అవాకులు, చెవాకులు పేలి నేడు రాజధాని లేని రాష్ట్రంగా చేశారన్నారు. కట్టడాలు కూల్చడం తప్పఒక్క వేసి అభివృద్ధి పనులు చేశారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రస్తుతం చంద్రబాబు ఉండి ఉంటే అమరావతిని పూర్తిచేసి ప్రపంచవ్యాప్తం ఆంధ్రరాష్ట్రానికి గుర్తింపు వచ్చి ఉండేదన్నారు. 2019లో వైసిపికి ఓటు వేసి పెద్ద తప్పు చేశామని రాష్ట్ర ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారన్నారు. 2024లో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడి ప్రజారంజకపాలనను అందించే తెలుగుదేశంపార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు ఇప్పటి నుండే సమాయత్తమవుతున్నారని బొల్లినేని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు కోడూరు నాగిరెడ్డి ,ఎస్సీ సెల్ , ఐపాక్ ప్రతినిధి ఆరికొండ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులు యాదవ్, దుత్తలూరు మాజీ ఎంపిపి శ్రీకుర్తి రవీంద్రబాబు, ,టిడిపి జిల్లా నాయకులు కాకి ప్రసాద్,మాజీ కన్వీనర్ గూడా నరసారెడ్డి, నాయకులు మహబూబ్‌బాషా, కొండపల్లి వెంకటేశ్వర్లు, పెద్దేటి చెన్నయ్య, పెరుమాళ్ళు, బాదుల్లా , పాములపాటి మాల్యాద్రి నాయుడు, వేణు, రాము, అబ్దుల్‌నబి తదితరులు పాల్గొన్నారు.

## రేపు నేదురుమల్లిచే గోనుపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

**రాపూరు,జూన్24ప్రభాతవార్త** రాపూరు మండలంలోని గోనుపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్నివెంకటగిరి నియోజ కవర్గ సమన్వయకర్త,తిరుపతి జిల్లా వైకాపా ఆధ్యక్షుడు,రాష్ట్ర కమ్యూ నిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రాం కుమార్ రెడ్డి నిర్వహించనున్నట్లు మండల అధికారులు తెలి పారు.అలాగే 27వ తేది మంగళవారం రామకూరు గ్రామంలో గడపగడపకు కా ర్యక్రమం వుంటుందన్నారు.ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు సంబందిత సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు అందరూ తప్పని సరిగా హాజరు కావాలని వారు కోరారు.